ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 36.0
కనిష్ఠం: 22.0

ఓట్లు బదిలీ కావాలి



అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

» సమస్యలుంటే చెప్పండి : టీడీపీ నేతలతో జనసేనాని పవన్‌కల్యాణ్

» గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి : పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం

భీమవరం/టౌన్/అర్బన్, ఫిబ్రవరి 21 : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ భీమవరం పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. భీమవరం నుంచి ఆయన పోటీ చేస్తారని చర్చ సాగుతున్న నేపథ్యంలో ఆయన ఒకరోజు పర్యటనకు రెండు పార్టీల అభిమానుల్లో ఉత్సాహం కనిపించింది. వందలాది మంది యువకులు, నాయకులు కార్లు, బైక్‌లపై పవన్‌ను అనుసరించారు. నినాదాలు చేస్తూ కల్యాణ్ బాబు సీఎం, సీఎం అంటూ నినాదాలు, కేరింతలు కొట్టారు. బుధవారం ఉదయం హెలికాప్టర్‌లో భీమవరం చేరుకుని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి నివాసానికి వెళ్లి దాదాపు గంటపాటు ఆమె కుటుంబ సభ్యులు సత్యనారాయణ, జగదీష్ తదితరులతో మాట్లాడారు. అనంతరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, ఆరిమిల్లి రాధాకృష్ణ, పొత్తూరి రామరాజు, అంగర రామ్మోహన్, వేటుకూరి శివరామరాజు తదితరులు పవన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో ప్రస్తుత రాజకీయాలు, పొత్తులపై చర్చించారు. టీడీపీ-జనసేన పార్టీల మధ్య ఓటు మార్పిడి జరగాలని పవన్ ఆకాంక్షించారు. జనసేన పార్టీతో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. 'అధికారంలోకి రావడానికి ఇరు పార్టీలు కలిసికట్టుగా కృషి చేయాలి. మండలాలు, గ్రామాల వారీగా రెండు పార్టీలు సమావేశాలను ఏర్పాటు చేసుకుని సమన్వయ పరచుకోవాలి' అని కోరారు. రెండు పార్టీలు కలిసి ఉమ్మడి పశ్చిమలోని 15 నియోజకవర్గాలు గెలిచి తీరుతామని ఇన్‌చార్జ్‌లు పవన్ దృష్టికి తీసుకువెళ్లారు. రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వెళదామని జనసైనికులకు పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేశారు. పెద అమిరంలోని నిర్మల ఫంక్షన్ హాల్‌లో బుధవారం పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'భీమవరంలో పోటీ చేయాలని 2019లో కొందరు ఆహ్వానించారు. ఇక్కడ పోటీ చేయాలన్న ఆలోచన నాకు లేదు. కొందరు నాయకుల ఆహ్వానం మేరకే ఇక్కడకు వచ్చాను. వారంతా ఇప్పుడు పార్టీలో లేరు. తులసి నా పక్కనే ఉండేవారు. ఎమ్మెల్యే కుమారుడికి నా కుమార్తెను ఇచ్చాను. అతన్ని ఏమీ అనవద్దంటూ తులసి చెప్పేవారు. ఇలా నా కాళ్లకు బంధాలు వేశారు. నిస్సత్తువ వచ్చేసింది. ఓటమి చవి చూడాల్సి వచ్చింది' అంటూ పవన్ గత అనుభవాలను పంచుకున్నారు. ప్రతీ చోట గెలుపే లక్ష్యంగా ముందుకు వెళదామని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. జగన్ ప్రభుత్వ వైఖరి, ప్రభుత్వ విధానాలు, తెలుగుదేశం పార్టీతో ఎందుకు కలిసి వెళ్లాల్సి వస్తోంది అనే అంశాలపై ఆయన వివరించారు. అనంతరం నాలుగు గంటలకు సమావేశాన్ని ముగించి అమరావతికి హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. కల్యాణ మండపం వద్ద మహిళలు, యువకులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. సమావేశం నుంచి రెండుసార్లు బయటకు వచ్చి కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేశారు. ఆయనతోపాటు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), చెనమల్ల చంద్రశేఖర్, వేగేశ్న కనకరాజు సూరి, బొలిశెట్టి శ్రీనివాస్, విడివాడ రామచంద్రరావు, జుత్తిగ నాగరాజు, బొమ్మిడి నాయకర్, మల్లినీడి తిరుమలరావు(బాబి) తదితరులు పాల్గొన్నారు.

గోకరాజు రామంకు పలకరింపు

టీటీడీ బోర్డు బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజును పవన్ పలకరించారు. రామరాజు సతీమణి ఇటీవల అస్వస్థతకు గుర య్యారని తెలుసుకుని వారితో కొద్దిసేపు మాట్లాడారు. అక్కడి నుంచి హెలీప్యాడ్‌కు చేరుకుని మంగళగిరి వెళ్లిపోయారు.



పవన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు వలవల బాబ్జి, మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, పితాని సత్యనారాయణ, తోట సీతారామలక్ష్మి, అంగర రామ్మోహన్, ఆరిమిల్లి రాధాకృష్ణ, వేటుకూరి శివ, పొత్తూరి రామరాజు తదితరులు

వైసీపీ జెండాతో హల్‌చల్

మాజీ ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ఇంటి వద్దకు టీడీపీ, జనసేన క్యాడర్ పెద్ద సంఖ్యలో చేరుకున్న సమయంలో ఒక వైసీపీ అభిమాని ఆ పార్టీ జెండాతో హల్‌చల్ చేశాడు. దీంతో కొందరు టీడీపీ కార్యకర్తలు అతని వద్దకు వెళ్లి హెచ్చరించటంతో జారుకున్నాడు.

పటిష్ఠ పోలీస్ బందోబస్తు

పవన్ పర్యటన సందర్భంగా 180 మందికిపైగా పోలీసులు రెండో పట్టణ సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు పోలీసులతో వాదనలకు దిగారు. కల్యాణ మండపం వద్ద మాత్రం పోలీసు, ప్రైవేట్ సెక్యూరిటీ ఎంపిక చేసిన జనసేన నాయకులను మినహా, మీడియా ప్రతినిధులను ప్రధాన ద్వారం వద్ద నిలిపివేశారు. హాలు వద్దకైనా తమను పంపాలని కొంత మంది మీడియా ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. వారు మాత్రం ససేమిరా అన్నారు. ఫొటోలు, వీడియోలు తామే పంపిస్తామంటూ తేల్చి చెప్పారు. మీడియా బయటే పడిగాపులు పడాల్సి వచ్చింది.

బీజేపీ నేత పాకా నివాసంలో

బీజేపీ సీనియర్ నేత పాకా వెంకట సత్యనారాయణ నివాసానికి పవన్ వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనలోని లోపాలను సరిదిద్దుతూ వచ్చే ప్రభుత్వంలో పాలనాపరమైన అంశాలు ఎలా ఉండాలనే అంశంపై చర్చించారు. జిల్లాలో బీజేపీ పరిస్థితులు, తాజా రాజకీయ అంశాలపై దాదాపు అరగంటపాటు చర్చించారు. వారితో పేరిచర్ల సుబాష్‌రాజు, కోమటి రవితోపాటు చిలుకూరి నరసింహ రాజు, కాయిత సురేంద్ర తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్, చిత్రంలో చినబాబు

» పోటీ చేస్తే గెలిపిస్తాం : అంజిబాబు



సమావేశం అనంతరం పవన్ బయటకు వచ్చి భారీగా తరలి వచ్చిన టీడీపీ శ్రేణులకు అభివాదం చేసి కారులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) నివాసానికి వెళ్లారు. అంజిబాబు, ఆయన కుమారుడు ప్రశాంత్‌తో తాజా రాజకీయాలపై చర్చించారు. మీరు భీమవరం నుంచి పోటీ చేస్తే గెలిపించే బాధ్యత తాము తీసుకుంటామని అంజిబాబు స్పష్టం చేశారు. వేరేచోట పోటీ చేస్తే ఇక్కడ తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. పొత్తులపై ఢిల్లీలో సమావేశమయ్యాక జిల్లాలోని అన్ని సీట్లపై స్పష్టత వస్తుందని పవన్ తేల్చి చెప్పారు. అలాగే ఆక్వా సమస్యలు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో జనం పడుతున్న ఇబ్బందులను జనసేనాని దృష్టికి తీసుకువెళ్లారు. చర్చల్లో టీడీపీ కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చింతలపూడి సారథి రోషన్

ఐదేళ్ల విరామం తర్వాత టీడీపీకి ఇన్‌చార్జి



» స్థానికంగా అన్నీ ఆచి తూచి తుది నిర్ణయం

» మిగతా ఆశావహులకు పార్టీలో సముచిత స్థానం

» పార్టీ కేడర్, నేతల హర్షామోదం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

చింతలపూడి తెలుగుదేశంలో నెలకొన్న సుదీర్ఘ సస్పెన్స్‌కు తెరపడింది. నియోజకవర్గ పార్టీ సారథ్య బాధ్యతలను సొంగా రోషన్‌కుమార్‌కు బుధవారం అప్పగించారు. 2019 సాధారణ ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ ఓటమి చెందడంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరినీ నియమించకుండా తాత్సారం చేశారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడం, ఆశావహుల సంఖ్య భారీగా ఉండడంతోపాటు మరింత మంది టిక్కెట్ రేసులో నిలిచారు. ఒకప్పుడు ఇక్కడ కోటగిరి విద్యాధరరావు ఏకపక్షంగా నాయకత్వం నడిపారు. ఆ తర్వాత ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మారడంతో రాజకీయాలు మొత్తం మారిపోయాయి. టీడీపీ పక్షాన డాక్టర్ కర్రా రాజారావు, పీతల సుజాత వంటి వారు పోటీపడ్డారు. సుజాత గెలుపొంది మంత్రిగా ఎదిగారు. 2019 ఎన్నికల్లో తడబాటుకు గురవడంతోపాటు ఓటమి కొనితెచ్చుకున్నారు. పార్టీలో అంతర్గతంగా ఉమ్మడి జవాబుదారీతనం కొరవడడం, ఎవరిది పైచేయి అనే విషయంలో పోటీయే సాగింది. గత రెండేళ్లుగా పార్టీ పూర్తి స్థాయిలో పుంజుకుంది. జంగారెడ్డిగూడెంకు చెందిన ఆకుమర్తి రామారావు, స్థానికంగా గడచిన దశాబ్ద కాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న రోషన్ కుమార్‌తోపాటు అనిల్ బొమ్మాజీ తెర ముందుకు వచ్చారు. వీరు ముగ్గురు ఎవరికి వారు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా వ్యవహరించారు. ఒక దశలో వీరి ముగ్గురిలో ఎవరికి టికెట్ లభించినా ఉమ్మడిగా పనిచేస్తామనే నిర్ణయానికి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ముత్తవరపు జగ్గారెడ్డి, శ్యామ్ చంద్రశేషు, మండవ లక్ష్మణరావు, గరిమెళ్ళ చలపతి, మోరంపూడి మల్లికార్జునరావు, గుత్తా ప్రసాద్‌తోపాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ల నాగేశ్వరరావు, రాపూరి కృష్ణ పక్కాల వెంకటేశ్వరరావు, మాటూరి వెంకట్రామయ్య వంటి నేతలంతా పార్టీ పటిష్టపడేలా జాగ్రత్తపడ్డారు. అనిల్ బొమ్మాజీ వంటి నేతలకే టిక్కెట్ దక్కినట్టు ప్రచారం సాగినా అధిష్ఠానం ఎటువంటి సంకేతాలు ఇవ్వకుండా మిన్నకుండింది. ఈలోపే పార్టీ టిక్కెట్ రేసులో వున్నారంటూ పలువురి పేర్లు తెర ముందుకు రావడంతో మరింత గందరగోళం ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థి మాదిగ సామాజిక వర్గానికి చెందివారే ఉంటారని చాన్నాళ్ల క్రితం పార్టీ అధినేత చంద్రబాబు చూచాయగా వెల్లడించారు. అప్పటి నుంచి మాదిగ లేదా మాల సామాజిక వర్గాల నుంచి ఎవరిని ఎంపిక చేస్తారని చర్చ సాగింది. ఈసారి గత అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని మాల సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ మధ్యనే పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి కొందరు కార్యకర్తలు గట్టిగా డిమాండ్ చేశారు. ప్రత్యేకించి హఠాత్తుగా కొందరి ప్రేరణతో కార్యకర్తలు ఈ తరహా డిమాండ్ చేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటారనుకున్నా, దీనికి భిన్నంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన రోషన్‌కుమార్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు.

విధేయతకే పెద్దపీట

ఇప్పటికే వైసీపీ అభ్యర్థిని ప్రకటించడం, టీడీపీ ఎప్పుడు బరిలోకి దిగుతుందా.. అని టెన్షన్ పడిన కార్యకర్తలూ నేతలకు తాజా నిర్ణయంతో కొండంత ధైర్యం వచ్చింది. ఎట్టకేలకు పార్టీ విధేయతకే పెద్దపీట వేసినట్లయ్యింది. ప్రత్యేకించి బుధవారం ఉదయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, లింగపాలెం వంటి మండలాల నేతలతోపాటు పార్టీ ఆశావహులు రోషన్‌కుమార్, అనిల్ బొమ్మాజీ, ఆకుమర్తి రామారావుతోపాటు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇన్‌చార్జి నియామకంలో అభిప్రాయసేకరణ అనంతరం పార్టీ ఇన్‌చార్జిగా రోషన్‌ను అధికారికంగా ప్రకటించారు. 'చింతలపూడి స్థానం నుంచి టిక్కెట్, పార్టీ పగ్గాలు ఆశించిన బొమ్మాజీ, రోషన్, రామారావులు చాలాకాలంగా శ్రమకోర్చి పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. వీరు ముగ్గురిలో ఒకరికే అవకాశం దక్కుతున్నందున మిగతా ఇద్దరికీ పార్టీలో విశాల దృక్పథంతో సముచిత స్థానం ఇస్తాం. పార్టీ అధినేత చంద్రబాబుతో మిగతా ఆశావహుల్ని త్వరలో సమావేశపరుస్తాం. పార్టీ విజయానికి ఉమ్మడి కృషి కొనసాగాలి' అంటూ అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.

ఆలయాల్లో రోషన్ పూజలు

చింతలపూడి/జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 21 : చింతలపూడి ఇన్‌చార్జిగా ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన సొంగా రోషన్‌కుమార్‌ను నియమించడంతో ఆయన పార్టీలో సమన్వయంతో అందరిని కలుపుకుని వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం తొలుత ధర్మాజీగూడెం, లింగపాలెం, రంగాపురం, జంగారెడ్డిగూడెం, గుర్వాయిగూడెం ప్రాంతాల్లోని పలు ఆలయాలను దర్శించి పూజలు చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, సీనియర్ నాయకుడు రాజాన సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. లింగపాలెం, కామవరపుకోట మండలాల్లోనూ పర్యటించారు.



జంగారెడ్డిగూడెం మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలసిన రోషన్

సీటు.. మాదే

» నరసాపురం టిక్కెట్‌పై బెట్టింగుల జోరు

నరసాపురం, ఫిబ్రవరి 21 : ఎన్నడూ లేని విధంగా ఈసారి ప్రధాన రాజకీయ పార్టీల మధ్య టిక్కెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉంది. ఇటు అభ్యర్థుల ఎంపిక, ప్రకటన కూడా ఆయా పార్టీలకు తలనొప్పిగా మారింది. కేడర్ మాత్రం ఇవేమి పట్టించుకోవడం లేదు. తమ నాయకుడికే టిక్కెట్ అని బల్లగుద్ది చెబుతూ మరీ పందేలకు కాళ్లు దువ్వుతున్నారు. దీనికి అవతల వర్గమూ మెట్టు దిగడం లేదు. దీంతో సీటుపై పందేలు జోరందుకున్నాయి. పది రోజులుగా నరసాపురంలో జరుగుతున్న ఈ పందేలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. వైసీపీ కూడా తమ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించలేదు. అయినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజే మళ్లీ పోటీ చేస్తారని చెబుతున్నారు. ఇప్పటికే టీడీపీ-జనసేన పొత్తులో వున్నాయి. ఈ కూటమిలోకి బీజేపీ కూడా చేరితే ఇక్కడ ఎవరు బరిలో ఉంటారన్నది తీరంలో చర్చ నడుస్తోంది. ఇటు టీడీపీ నుంచి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన నుంచి బొమ్మిడి నాయకర్ బరిలో వున్నారు. మరోవైపు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఈసారి పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెడతానని ప్రకటించారు. ఈ నెలాఖరున జనసేన పార్టీలో చేరనున్నట్టు ఆయన వర్గీయులు ప్రకటించారు. పొత్తు ఖరారై వీరిలో ఎవరు అభ్యర్థులుగా నిలుస్తారు ? అన్న ఉత్కంఠ అన్ని పార్టీల్లోను నెలకొంది. తమకే టిక్కెట్ వస్తుందని ఆయా పార్టీల నేతలు చెబుతుండగా, వారి అభిమానులు సైతం తమ పార్టీ నేతకే టిక్కెట్ వస్తుందని చెబుతున్నారు. కావాలంటే పందెం కాయాలంటూ అవతలి పక్షం వారికి సవాల్ విసురుతున్నారు. లక్షల రూపాయల పందేలు కేవలం టీడీపీ-జనసేనలోని ముగ్గురు నేతలపైనే కాస్తున్నారు. రేస్‌లో ఉన్న నాయకులు మాత్రం పార్టీ టిక్కెట్ తమకే ఇస్తుందన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఈ వారంలో దీనిపై పూర్తి క్లారిటీ రానుంది.

డిజిటల్ లైబ్రరీలతో స్వీయ అధ్యయనం : కలెక్టర్

జంగారెడ్డిగూడెం/బుట్టాయగూడెం, ఫిబ్రవరి 21 : స్వీయ అధ్యయనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ గ్రంథాలయాలను బుధవారం ఆయన ప్రారంభించారు. జిల్లాలో ఆరు ప్రాంతాల్లో డిజిటల్ లైబ్రరీలను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఏలూరులో కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.40 లక్షలతో, మిగిలిన ఐదు చోట్ల ఒక్కొక్కటి రూ.10 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇటీవల జీలుగుమిల్లి బాలుర వసతి గృహంలో కలుషిత ఆహార ఘటనపై మాట్లాడుతూ కలుషిత ఆహారానికి సంబంధించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారని, నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని, మెను పాటించక పోయినా నాణ్యతలో తేడాలొచ్చినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ బి.నాగలక్ష్మి, జడ్పీటీసీ పొల్నాటి బాబ్జి, డీఈవో ఎస్.అబ్రహం, హెచ్ఎం లోవకుమారి, ఐటీడీఏ డీడీ నాయుడు, సర్పంచ్ మడకం రామలక్ష్మి, ప్రిన్సిపాళ్లు రజనీబాయ్, విజయలక్ష్మి, ఎంపీడీవో సుధా ప్రవీణ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈవో బాబురావు, డీవైఈవో నీలయ్య, ఈఈ కుమార్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో డిజిటల్ లైబ్రరీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

చినవెంకన్న ఆలయ బడ్జెట్ ఆమోదం

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 21 : శ్రీవారి ప్రధాన ఆలయ ఆదాయంతో ఇతర ట్రస్టులకు 2024-2025 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదిస్తూ దేవస్థానం ట్రస్ట్ బోర్డు బుధవారం తీర్మానం చేసింది. అయితే ఎప్పటి నుంచో ఉన్న శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకం ట్రస్టు గురించి ఏవిధమైన వివరాలు వెల్లడించలేదు. స్వామివారి ఆలయ ట్రస్టు బోర్డు సమావేశం చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశ వివరాలను ఈవో వేండ్ర త్రినాథరావు ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఇందులో శ్రీవారి ప్రధాన ఆలయానికి అంచనా ఆదాయం రూ.128,89,65,000 కాగా అంచనా వ్యయాన్ని రూ.127,76,00,000లుగా చూపారు. అన్నదాన ట్రస్టుకు అంచనా ఆదాయాన్ని రూ.21,10,00,000 అంచనా వ్యయాన్ని రూ.21,01,00,000గా తీర్మానించారు. గో సంరక్షణ ట్రస్టుకు అంచనా అదాయం రూ.2,97,00,000 అంచనా వ్యయం రూ.2,90,00,000, ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు అంచనా ఆదాయం కాగా అంచనా వ్యయం రూ. 9.86 లక్షలు, విద్యాదాన ట్రస్టుకు అంచనా ఆదాయం రూ.3,47,50,000, అంచనా వ్యయం రూ.3,45,00,000లుగా చూపుతూ తీర్మానించారు. రానున్న వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణ చర్యలపై ఆమోదించారు.

25న ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ ఇసుక కొరత, కొవిడ్ కారణంగా నిర్మాణరంగ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కష్టకాలంలో ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్రాలు పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు ఈనెల 25న ఏలూరు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నామని బుధవారం సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, హేలపూరి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవసలహాదారు ఎం.శంకర్‌రావు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మిరపలో అత్యాధునిక రకాలు అభివృద్ధి చేయాలి



వర్చువల్‌లో మాట్లాడుతున్న మంత్రి కాకాని

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 21: మిరపలో చీడపీడలు తట్టుకునే రకాలతోపాటు, ప్రాసెసింగ్‌కు అనువైన రకాలు అభివృద్ధి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ సూచించారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం ఇయర్ ఆఫ్ చిల్లీస్ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ సంచాలకులు డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ మిరప పంటలో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. జాతీయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీకే బెహరా మాట్లాడుతూ శాస్త్రవేత్తలు మిరపలో ప్రాసెసింగ్‌తోపాటు ఫ్లెక్స్, సాస్‌కు అనువైన రకాలు తయారుచేయాలని సూచించారు. అనంతరం ఇయర్ ఆఫ్ చిల్లీస్ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యాన ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్, అఖిల భారత కూరగాయల పథకం అధిపతి డాక్టర్ రాజేష్‌కుమార్, ఉద్యాన పరిశోధనా సంచాలకులు ఎల్.నారంనాయుడు మాట్లాడారు.

'ఆపరేషన్ వాలంటైన్' చిత్ర బృందం సందడి



మాట్లాడుతున్న హీరో వరుణ్ తేజ్, చిత్ర బృందం

దెందులూరు, ఫిబ్రవరి 21 : గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాల్లో ఐదోరోజు బుధవారం మెగా ప్రిన్స్, సినీ హీరో కొణిదెల వరుణ్ తేజ్, 'ఆపరేషన్ వాలంటైన్' చిత్ర బృందం సందడి చేసింది. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, మెగా అభిమాన సంఘం నాయకులు పెద్దిశెట్టి నాని, ఏనుగు రామకృష్ణ, వెంకటరత్నం నాయుడు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి సన్నిధిలో ఆపరేషన్ వాలంటైన్ ప్రమోషన్ చేయడం చాలా ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులతో సూపర్ హిట్ అవుతుందన్నారు. మెగా అభిమానులను ఉద్దేశించి హీరో మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రేమ అప్యాయతలకు, స్నేహానికి పుట్టినిల్లు మన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాసులని వారి అదరణతోనే మా మెగా ఫ్యామిలీ ఇంతటి స్థాయిలో ఉందన్నారు. అధిక సంఖ్యలో అభిమానుల రాకతో రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ నిలిచి పోయింది. అనంతరం రాత్రి 11 గంటల నుంచి సుప్రీమ్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జబర్దస్త్ టీం రాజమౌళి, షేకింగ్ శేషు, రిషిత, కెవ్వు కార్తిక్, యాంకర్ యాపిల్, పాడుతా తీయగా ఫేం సింగర్ చరణ్, రాజీ ప్రదర్శనలు చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు కాంగ్రెస్ నాయకుల తరలింపు

» ప్రత్యేక హోదా ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



చింతలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు

చింతలపూడి, ఫిబ్రవరి 21 : చింతలపూడి మండలంలో పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈనెల 22న అమరావతిలో ప్రత్యేక హోదాపై ధర్నా చేపట్టబోతున్న పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలకు మద్ద తు తెలిపేందుకు వెళ్తున్నారన్న సమాచారంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి.సుందరరావు, నాయకులు ఎం.వెంకటేశ్వ రరావు, సంకు ప్రసాద్, ఎస్.సుందరరావు, కె.కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మురళీ, పోతురాజు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోతునూరులో నియోజకవర్గ ఇన్‌చార్జి హౌస్ అరెస్ట్

దెందులూరు :వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న జగన్ రెడ్డికి ప్రజలందరూ బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని దెందులూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డీవీఆర్‌కే చౌదరి అన్నారు. సీఎం క్యాంపు ఆఫీసు ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నిరసన కార్యక్ర మానికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు బుధవారం అయనను హౌస్ అరెస్ట్ చేశారు.

ఆచంటలో నెక్కంటి సతీశ్‌కు నోటీసు

ఆచంట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సచివాలయ ముట్టడి కార్యక్రమానికి వెళ్లడానికి పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున కాంగ్రెస్ నాయకులు వెళ్లకూడదని ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆచంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నెక్కంటి సతీశ్‌కు బుధవారం నోటీసు అందజేశారు.

పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

» అటవీ క్షేత్రాధికారి దావీదు రాజు హెచ్చరిక



వేళ్లచింతలగూడెం వద్ద పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పోలవరం, ఫిబ్రవరి 21 : పులి సంచారం పట్ల కూలి పనులకు వెళ్లే కూలీలు, పొలాల్లో పనిచేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదు రాజు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేవరపల్లి మండలం బందపురం, దేవరపల్లి హైవే ప్రాంతాల్లో సంచరించిన పులి గోపాలపురం మండలం వేళ్ల చింతలగూడెం, పెద్దాపురం, గుడ్డిగూడెం, చిట్యాల పరిసర ప్రాంతాల్లోని పొగాకు, జామాయిల్ తోట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుందని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి సంచారం అంతుబట్టని విధంగా ఉంటుందని హైవే సమీపంలో వాహనాల శబ్దాలకు సమీప పొంతాల్లో తిరుగాడుతుందని పోలవరం, గోపాలపురం మండలాల పరిధిలో గతంలో పులి సంచరించిన ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలోని అవంతి ఫ్యాక్టరీ సమీపంలో పులి తిరిగినట్టు పాదముద్రలు చూసిన కూలీలు భయంతో ట్రాక్టర్ ఎక్కి వచ్చేశారని, సమీపంలో పులి గాండ్రింపులు కూడా వినిపించాయని ప్రసార మాధ్యమాల్లో ప్రచారాలు కొనసాగుతున్నాయి.



కైకలూరులో జర్నలిస్టుల ర్యాలీ, లింగపాలెం, జీలుగుమిల్లిలో తహసీల్దార్లకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు, చినమల్లంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

జర్నలిస్టులకు రక్షణ కరువు

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడికి నిరసనగా ఆందోళనలు

అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టుపై వైసీపీ నాయకుల మూకుమ్మడి దాడి దారుణం.. అని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆందోళనలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాల వద్ద అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

కైకలూరులో జర్నలిస్టుల ర్యాలీ

కైకలూరు, ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, పత్రికాస్వేచ్ఛను కాపాడాలంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. బుధవారం కైకలూరులో నియోజకవర్గ ప్రెస్ క్లబ్, ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో విలేకర్లపై దాడులు ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎస్. పోతురాజు, రూరల్ సీఐ కృష్ణకుమార్, టౌన్ పోలీసుస్టేషన్ ఏఎస్సై వెంకటేశ్వరరావుకు వినతిపత్రాలను అందజేశారు. ఏలూరు జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి పెద్ది సురేష్, కార్యవర్గసభ్యుడు నరహరిశెట్టి శ్యాం బాబు, విజయకుమార్, కురేళ్ళ కిషోర్, వాసే పౌలురాజు, ముదినేపల్లి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నాగరాజు,వై.శ్రీనివాసు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కె.సువర్ణరాజు, ఎ.సత్యనారాయణ, సంపత్, నిక్కు శంకర్, ఎస్‌వీఎస్ పేర్రాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం : కొల్లు పెద్దిరాజు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, జగన్ పాలనలో ఇటు ప్రజలకు, పాత్రికేయులకు కూడా రక్షణ లేకుండా పోయిందని టీడీపీ పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు మండిపడ్డారు. బ్రిటిష్ కాలంలో కూడా మీడియాకు ఇలాంటి పరిస్థితులు లేవని, విలేకర్లపై కొందరు వైసీపీ అల్లరిమూకలు చేస్తున్న దాడులు, దూషణలు చూస్తుంటే జగన్ పతనానికి పరాకాష్టగా నిలుస్తుందన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి : ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 21: ప్రతికా స్వేచ్ఛను కాపాడి..జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నాయకులు లంక కృష్ణ మూర్తి, దండు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి, ఈనాడు కార్యాలయంపైన దాడులను తీవ్రంగా ఖండించారు.

ఉంగుటూరులో నిరసన

ఉంగుటూరు, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలో పాత్రికేయలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం ఉంగుటూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పోతురాజుకు వినతి పత్రం అందించారు. అధ్యక్షుడు ముప్పన భుజంగరావు, ఉపాధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరావు, ఆర్జా బులి వీరాస్వామి, పి.రవిశంకర్ పాల్గొన్నారు.

దాడి అమానుషం : లింగపాలెం ప్రెస్‌క్లబ్ సభ్యులు

లింగపాలెం, ఫిబ్రవరి 21 : రాప్తాడు ముఖ్యమంత్రి సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడాన్ని లింగపాలెం మండల ప్రెస్‌క్లబ్ తీవ్రంగా ఖండించింది. జర్నలిస్టలపై దాడిచేయడం అమానుషమని లింగపాలెం ప్రెస్‌క్లబ్ సభ్యులు అన్నారు. ఈ మేరకు లింగపాలెం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విలేకరులు రాపాక మోహన్‌రావు, ఎస్.డి.వి ప్రసాద్, కట్టా శ్రీనివాసరావు, చలమాల శ్రీనివాసరావు, కుమార్ మంగళం, లక్కపాం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మీడియాపై దాడి అమానుషం : పితాని

పెనుగొండ, ఫిబ్రవరి 21: జగన్మోహనరెడ్డి ప్రభుత్వ అక్రమాలపై నిజాలను నిగ్గు తేలుస్తున్న మీడియా సంస్థలు, ప్రతినిధులుపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని చినమల్లంలో ప్రజల వద్దకు పితాని ఎన్నికల ప్రచార పాదయాత్రను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికల స్వేచ్ఛలను కాలరాస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. అడుగడుగునా ఆయనకు పూలవర్షం కురిపించారు. వెలిచేటి బాబూరాజేంద్రప్రసాద్, గుత్తుల లోకేశ్‌కు మార్, కొండవీటి శ్రీనివాసరావు, ఆకుల శివ, జి.ప్రసాద్, వెంగళదాసు దానయ్య, బొక్కా ఏడుకొండలు, నెక్కంటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నక్కా శ్యామలా సోని పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు తగవు..

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 21 : ఫొటో గ్రాఫర్‌లు, జర్నలిస్ట్‌లపై దాడులు తగవని జీలుగుమిల్లి మండల ప్రెస్‌క్లబ్ తరఫున తహసీల్దారు ఆర్‌వీ వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. విలేకరులకు రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేయాలన్నారు. ప్రెస్ క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మారెడ్డి ప్రసాదరెడ్డి, జెట్టి రామకృష్ణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యులు కోలా రాము, సభ్యులు బొలగాని సత్తిబాబు, క్రొవ్విడి ప్రసాద్, నక్కా శ్రీను, ఉడా ప్రసాద్, కొప్పుల సాయి ఉన్నారు.

విలేకరులపై దాడులు హేయమైన చర్య : సీపీఐ

కుక్కునూరు:నిజాలను నిక్కచ్చిగా రాస్తున్న విలేకరులపై దాడులు చేయడం హేయమైన చర్య అని సీపీఐ కుక్కునూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం కుక్కునూరులో జరిగిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై, కర్నూల్‌లో ఈనాడు కార్యాలయంపై, మద్దికేరలో ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నా మన్నారు. సీపీఐ జిల్లా నాయకులు కె.లక్ష్మయ్య, వరకా శ్యామల, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవాలు



గజ, పొన్న వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో భక్తులు బారులు తీరారు. తొలుత పొలమూరి వారి వార్షిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పొలమూరి కుటుంబసభ్యులు, భక్తులు పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగిన నాగేశ్వరరావు వారిచే నిర్మితమైన గజ వాహనంపై స్వామిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి వెంట నారసింహ, గోవింద నామస్మరణ చేశారు. శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకటసత్యనారాయణ, శ్రీహరిరావు వారిచే పొన్నవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం రాత్రి ఎనిమిది గంటలకు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి హారతులు పట్టారు.

స్వామికి అన్నపర్వత మహానివేదన

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామికి అన్నపర్వత మహా నివేదన జరిపారు. పశ్చిమగోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. సాయంత్రం స్వామివారి మూల విరాట్ ఎదుట ఉన్న గంట మండపంలో అన్నాన్ని రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామికి మహానివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపం డితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామికి పూజలు నిర్వహించారు.

అంతర్వేదిలో నేడు..

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని హనుమద్ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు పండిత సదస్యం, ఏడు గంటలకు సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

నరసన్న సేవలో హోంమంత్రి వనిత



స్వామిని దర్శిస్తున్న హోంమంత్రి వనిత

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి21: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐ.ఎస్. జగన్నాథపురంలోని లక్ష్మీనారసింహుని ఆలయాన్ని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత సందర్శించారు. ఆమెకు అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారి మూలవిరాట్‌ను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందగా అధికారులు ద్వారకాతిరుమల స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఎంపీపీ బొండాడ మోహినీవెంకన్నబాబు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

» కొప్పాకలో నాబార్డు బృందం పర్యటన.. రైతులతో ముఖాముఖి



సమస్యలు తెలుసుకుంటున్న నాబార్డు అధికారులు

పెదవేగి, ఫిబ్రవరి 21 :కౌలు రైతులకు అందిస్తున్న రుణాలు, కౌలుకార్డుల పంపిణీ జరిగిన విధానం, సమస్యలను తెలుసుకోవడం ద్వారా పరిష్కారానికి అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ వై.రామకృష్ణ అన్నారు. ముంబై నుంచి నాబార్డు అధికారుల బృందం కొప్పాక లోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును బుధవారం సందర్శించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే దానిపై చర్చించారు. అనంతరం గ్రామీణ బ్యాంకులో కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసిన విధానాన్ని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డుల ద్వారా రుణాలు అందించే క్రమంలో కొంతమంది కౌలు రైతులకు రుణాలు సక్రమంగా అందడంలేదనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. నాబార్డు ప్రధాన కార్యాలయం అధికారులు బెంజిమెన్ థామస్, అరవిందకుమార్, ప్రణవ్ ఖత్రి, సమరక్ మొహంతి, అనిల్‌కాంత్, నీలాద్రి, పెదవేగి ఏవ ఎం.ప్రియాంక ఉన్నారు.

తెలుగు భాషలో రెండు తీర్పులు



భీమవరం క్రైం, ఫిబ్రవరి 21 :మాతృభాషా దినోత్సవం రోజున బుధవారం భీమవరం న్యాయస్థానంలోనూ, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పాలకొల్లు న్యాయస్థానంలోనూ సివిల్ కేసులలో మాతృభాష తెలుగులో తీర్పునిచ్చి మరోసారి తన మాతృభాష తెలుగు పట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయాధికారి ఏకా పవన్‌కుమార్ కృతజ్ఞత ప్రకటించారు. భీమవరంలోని పౌరులందరికీ ముఖ్యంగా సదరు వాజ్యములలోని కక్షిదారులకు తమ వాజ్యము ఎందుకు గెలిచామో, లేక ఓడిపోయామో అనేది అర్థం అవ్వాలంటే తీర్పులను సంబంధిత ప్రాంతీయ భాషలలోనే ఉంటే బాగుంటుందని, ఈ విషయమై భారత ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తిగా వచ్చినప్పటి నుంచి సాధ్యమైనంత వరకు తీర్పులను తెలుగు భాషలోనే ఇస్తున్నామన్నారు. న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకు 25 వాజ్యములలో తెలుగులో తీర్పులు అందించానన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా తన బాధ్యతగా తెలుగులోనే న్యాయపరిపాలన అందించాలనే కోరికతో భీమవరం న్యాయ స్థానంలోని వాజ్యములోనే కాక, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పాలకొల్లు న్యాయస్థానంలోనూ రెండు పౌర వాజ్యములలో తెలుగులో తీర్పు ప్రకటించినట్లు తెలిపారు.

తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు

పోలవరం, ఫిబ్రవరి 21 : కొవ్వూరు డిపో నుంచి షణ్ముక రామేశ్వరం, బాలరామ అయోధ్య, కాశీ యాత్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వైవీవీఎల్ఎస్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షట్ షణ్ముక రామేశ్వరం యాత్రలో తిరుచందూరు సుబ్రహ్మణ్యస్వామి, ఫలణి సుబ్రహ్మణ్య స్వామి, రామేశ్వర జ్యోతిర్లింగం శ్రీకాళహస్తి, తిరుత్తణి, కంచి, స్వామిమలై, పుజుచోమలై, మదురై, త్రిపుర కుండం, కన్యాకుమారి, తిరువణ్ణామలై శ్రీపురం, కాణిపాకం ఏడు రోజుల యాత్ర ఉంటుందని, పది రోజుల బాలరామ అయోధ్య కాశీయాత్రలలో మూడు రోజులు కాశీలో ఉండే విధంగా భువనేశ్వర్, పూరీక్షేత్రం, కోణార్క్, ప్రయాగ, నైమిశారణ్యం, అయోధ్య, కాశీ, గయ, శిరోగయ, బుద్ధగయ, అరసవల్లి, శ్రీకూర్మం, అన్నవరం పుణ్య క్షేత్రాల సందర్శన ఉంటుందన్నారు. కాశీ, అయోధ్య ఏడు రోజుల సత్వర యాత్ర ఉంటుందని భక్తుల సౌకర్యార్థం తక్కువ చార్జీలతో బస్సుల యాత్రలు కొనసాగుతాయన్నారు. వివరాలకు డిపో మేనేజర్ 91009 54631, ఏడీసీ 73829 07952 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆచంటలో అక్రమ కట్టడాల కూల్చివేత



ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

ఆచంట, ఫిబ్రవరి 21: కోర్టు ఉత్తర్వుల మేరకు ఆచంటలో జీ+2 షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి రోడ్డుపై నిర్మించిన టాయ్‌లెట్స్ లిఫ్ట భాగానికి సంబంధించి పిల్లర్‌లను ఎక్స్‌వేటర్ సాయంతో తొలగించినట్టు పంచాయతీ కార్యదర్శి నాగబాబు బుధవారం తెలిపారు. ఆచంటలోని మదనగోపాలస్వామి ఆలయం పక్కన నిర్మిస్తున్న జీ+2 షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి అక్రమంగా పంచాయితీ రోడ్డుపై నిర్మించారంటూ గ్రామానికి చెందిన నంబూరి రామ్‌కుమార్ 2022లో కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణంపై గతంలోనే రామ్‌కుమార్ కోర్టుకు ఫిర్యాదు చేయడంతో హైకోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించామన్నారు. రానున్న రోజుల్లో రోడ్డుపై నిర్మించిన షాపునకు సంబంధించి అటువంటి వారికి కూడా నోటీసులు ఇచ్చి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, స్థానిక పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.87 లక్షల రేషన్ బియ్యం పట్టివేత

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 21 : తెలంగాణ నుంచి ఆంధ్రాకు వస్తున్న అక్రమ రేషన్ బియ్యం లోడు లారీని జీలుగుమిల్లి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించారు. మంగళవారం రాత్రి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా లారీలో తరలించే 215 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చెక్‌పోస్టు నిఘా అధికారులు పట్టుకున్నారు. ఈ విషయమై సివిల్ సప్లయిస్ డీటీ ఎన్. సురేంద్ర, వీఆర్వోలు బుల్లిఅబ్బులు, షరీఫ్‌ల ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం విలువ రూ.3.87లక్షలు, లారీ విలువ రూ.5 లక్షలు మొత్తం రూ.8.87 లక్షలు ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి భీక్కవోలు కోళ్ల ఫారంకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నందిగామ జిల్లా చంద్రలపాడుకు చెందిన డ్రైవర్ మాతంగి శ్రీను, లారీ యజమాని గోపిపై కేసు నమోదు చేశారు. సరుకు వాహనం స్వాధీనం చేసుకున్నారు.

క్రైం సమాచారం

విద్యుత్ షాక్‌తో ఐటీఐ విద్యార్థి మృతి

యలమంచిలి, ఫిబ్రవరి 21 : మండలంలోని కాజ పడమర గ్రామం నెక్కంటివారి చెర్వుగట్టు ప్రాంతానికి చెందిన కానేటి నీరాజ్‌బాబు(18) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. గ్రామానికి చెందిన నీరాజ్‌బాబు ఉల్లంపర్రు ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో తాళ్ల శ్రీనివాసరావు అనే ఎలక్ట్రీషియన్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం యథావిధిగా చించినాడ పనికి వెళ్తున్నానని ఇంటివద్ద చెప్పి వెళ్లాడు. చించినాడలో కొత్తగా నిర్మిస్తున్న ఓ భవనంలో కరెంట్ పనిచేస్తుండగా షాక్ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వా సుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గీత కార్మికుడి బలి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని ఈదర గ్రామంలో పామర్తి సుబ్బారావు(70) ప్రమాదవశాత్తు విద్యుత్ తీగె తగిలి చెట్టుపైనే ప్రాణాలు వదిలాడు. ఇంటివద్ద గల కొబ్బరిచెట్టు కాయలు దింపేందుకు చెట్టెక్కగా ప్రమాదవశాత్తు చెట్టుకు ఆనుకుని వెళుతున్న కరెంటు లైన్ తీగ తగిలి అక్కడే ప్రాణాలు వదిలాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలునుంచి జారిపడి వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక గుర్తు తెలియని వృద్ధుడు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాలివి.. ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని పెద్దఔట్‌పల్లి రైల్వే గేటు సమీపంలో సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు గల వృద్ధుడి మృతదేహం ఉన్నట్టు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు లేత ఆకుపచ్చరంగు లుంగీ, తెలుపు రంగు పొట్టి చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. ముక్కుపొడి రంగుతో కూడిన టవల్ ఉంది. మృతుడి చేతికి నలుపురంగు కాశీతాడు, ఎరుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్ఐ 95026 97672కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధం



రేకుల షెడ్డు వద్ద మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

ఆకివీడు, ఫిబ్రవరి 21: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధమైన ఘటన ఆకివీడులో జరిగింది. స్థానిక వారపుసంతలోని పోతుల సందులో పోతురాజు-చిన్నరమణమ్మ నివాసముంటున్నారు. తూర్పు గోదావరిలో జరుగుతున్న గాజులమ్మ జాతరకు ఈనెల 19న ఇంటి వద్ద రమణమ్మ తల్లిని ఉంచి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున మంటలు వస్తుండడంతో భయాందోళనతో ఆమె బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికుడు గుర్రాని శ్రీను అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపుచేసే సమయానికే పూర్తి దగ్ధమైంది. రూ.1.80 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపకశాఖాధికారి వై.నాగేశ్వరరావు తెలిపారు. రేకుల షెడ్డుకు సమీపంలో వున్న మరో ఇంటిలో దీపావళి మందుగుండు సామగ్రి కూడా నిప్పు అంటుకోవడంతో వాటిని అగ్నిమాపక సిబ్బంది అదుపుచేశారు.



చెరువు గట్ల వద్ద పరిశీలిస్తున్న రైతులు, చనిపోయి తేలిన చేపలు

చేపల చెరువులో విషప్రయోగం

» నీటిపై తేలిన చేపలు.. పాటదారుడి గగ్గోలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి21: పంచాయితీ చెరువులో జరుగుతున్న చేపల పెంపకంపై విషప్రయోగం జరగడంతో పాటదారుడు లబోదిబోమంటున్నాడు. మండలంలోని గుండుగొలనుకుంటకు చెందిన వెంకన్నబాబు పంచాయతీకి చెందిన చెరువును చేపల పెంపకం నిమిత్తం రూ.4.50లక్షలకు గతేడాది సెప్టెంబరులో లీజుకు తీసుకున్నాడు. అనంతరం సుమారు రూ.పది లక్షల పెట్టుబడితో బంగారు తీగ చేపపిల్లలను పెంచుతున్నాడు. మరో మూడునెలల్లో చేపలు పెరిగి చేతికి వచ్చేసమయంలో బుధవారం ఉదయం చెరువు దగ్గరకు వెళ్లి చూసే సరికి అవన్నీ చనిపోయి నీటిపై తేలుతూ కన్పించాయి. ఈ విషయాన్ని స్థానిక రైతులకు తెలుపగా వారు వచ్చి పరిశీలించి చెరువులోను, గట్లపైన పురుగుమందుల అవశేషాలను గుర్తించారు. విషప్రయోగం జరిగి ఉండవచ్చనే అనుమానంతో ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో మూడు గొర్రెల మృత్యువాత



చనిపోయిన గొర్రెల వద్ద రైతు భాస్కరరావు

పెదవేగి, ఫిబ్రవరి 21 : విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పెదకడిమికి చెందిన బాధిత గొర్రెల యజమాని నెర్సు భాస్కరరావు తెలిపిన వివరాలివి.. కొప్పాకనుంచి చినబోయినపల్లి వెళ్లే రోడ్డులో గో-సంరక్షణ సమితి సమీపంలో గొర్రెలు మేస్తుండగా రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎర్త్ వైరును గొర్రెలు తాకడంతో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడం తోపాటు ఎర్త్‌వైరుకు విద్యుత్ ప్రవహించడంతో ఈ ప్రమాదం జరిగిందని సుమారు రూ.60 వేల విలువైన మూడు గొర్రెలు చనిపోయాని గొర్రెల యజమాని భాస్కరరావు తెలిపారు. మృత్యువాత పడిన గొర్రెలకు పరిహారం అందించే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు..



ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ

పెదవేగి, ఫిబ్రవరి 21 : కొప్పాకలో చోరీ జరిగిన ఘటనపై పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పామర్తి రాము భార్య, పిల్లలతో కలిసి మంగళవారం సాయంత్రం అత్త గ్రామమైన ముసునూరు మండలం గోపవరం వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేస రికి ఇంటి తలుపుల తాళాలు పగుల గొట్టి, బీరువాతో పాటు ఇంట్లో వస్తువులను చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదుతో కలిపి మొత్తం రూ.5 లక్షల విలువైన వస్తువులు చోరీ జరిగిందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్‌కు ఓటమి భయం


ప్రజలతో మాట్లాడుతున్న బడేటి చంటి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 21: జగన్ ఓటమి భయంతో టీడీపీ నాయకులపై భౌతికదాడులకు దిగుతున్నారని టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. 21వ డివిజన్‌లో బుధవారం ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6పథకాలు వివరించారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావల్సిన అవశ్యకతను వివరించారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ అరాచక పాలన కొనసాగిస్తుందన్నారు. సర్వేల్లో వైసీపీ ఓటమి ఖరారు కావడంతో జగన్ దిక్కుతోచని స్థితిలో ఉన్నాడన్నారు. అట్లూరి రామకృష్ణ, భాస్కరరావు, కే.కిషోర్, వైహెచ్ శ్రీనివాస్, బాబూరావు, సీహెచ్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బడేటి క్యాంపు కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సన్నాహక సమావేశం నిర్వహించారు. దాసరి ఆంజనేయులు, జాలా బాలాజీ, తంగిరాల సురేశ్, మోజేష్, లంకపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

సొంగా రోషన్ ఎంపికపై టీడీపీ శ్రేణుల హర్షం


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నేతల నివాళి

లింగపాలెం, ఫిబ్రవరి 21: చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జిగా సొంగా రోషన్ కుమార్ ఎంపికపై మండలంలో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచారు. మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచా కాల్చి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరు రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కామవరపుకోట: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సొంగా రోషన్‌కుమార్‌ను అధిష్ఠానం ప్రకటించడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ మాట్లాడుతూ రోషన్‌కుమార్ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. తాడిచర్ల, రావికంపాడు, గుంటుపల్లి, ఆడమిల్లి సర్పంచ్‌లు పసుమర్తి పార్థసారధిబాబు, వేముల నాగేశ్వరరావు, గోరింక దాసు, గూడపాటి కేశవరావు, కంఠమనేని పుష్పరాజ్యం, ఘంటా సుధీర్‌బాబు, బేతిన వెంకట్రావు, కంఠమనేని చిన సత్యనారాయణ, అంజిమూర్తి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : బొరగం


మినీ మేనిఫెస్టో వివరిస్తున్న బొరగం

టి.నరసాపురం, ఫిబ్రవరి 21: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు తెలిపారు. వల్లంపట్ల పంచాయతీ శివారు శింగరాయపాలెంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో బుధవారం ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టో వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. శీలం వెంకటేశ్వరరావు, తోట లక్ష్మీనారాయణ, జోనుబోయిన సోంబాబు, సందేపూడి సాయి, పేరుబోయిన శ్రీనివాసరావు, కాల్నీడి రాంబాబు, సాధనాల బూసిబాబు, చవల అప్పలరాజు, గుండం వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో జోరుగా చేరికలు


జనసేనలో చేరిన వారితో అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21: నగరంలో పలువురు నాయకులు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో తెనాలి పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారని రెడ్డి అప్పలనాయుడు బుధవారం తెలిపారు. జనసేనలో చేరిన వారిలో కంభంపాటి రామ్మోహన్‌రావు, దొడ్డిపట్ల పుల్లారావు, పొనుగంటి వెంకటరమణ, దాశరధి, కమ్ముల చంద్రశేఖర్, వెన్నవల్లి రామచంద్రరావు, తట్టా గంగాధర్, కర్రె రామాంజనేయులు, మద్దుల రమణకుమార్, వినయ్, యర్రంశెట్టి భవాని, శీర్ల పార్థసారధి, మోతేపల్లి ఉమామహేశ్వరరావు, లక్ష్మణకుమార్, గ్రంధి బంధారి, రాజనాల బహదూర్, రేపూరి భరత్, కంచద విజయ్, యర్రంశెట్టి నాగమణి, పి.రామచంద్రరావు తదితరులు చేరినట్టు అప్పలనాయుడు తెలియచేశారు. వారికి నాదెండ్ల మనోహర్, పార్టీకండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ విజయం ఖాయమని స్పష్టం చేశారు.

ఆడమిల్లిలో హాస్టల్ ప్రారంభించిన కలెక్టర్


హాస్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ

కామవరపుకోట, ఫిబ్రవరి 21: ఆడమిల్లిలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో సాంఘిక సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్, ఎంపీ కోటగిరి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తామన్నారు. సర్పంచ్ గూడపాటి కేశవరావు, సోషల్ వెల్ఫేర్ జెడి భానుప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, వార్డెన్ అంజన, కార్యదర్శి వి.రాజేష్, వీఆర్వో బి.వెంకన్నబాబు, పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి : ఎస్పీ మేరీ ప్రశాంతి


చెక్ అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21 : జిల్లా హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. హోంగార్డు విభాగంలో పనిచేస్తూ 2022 నవంబర్ 29న మరణించిన వై.లక్ష్మణరావు కుటుంబానికి హోంగార్డు సంక్షేమ నిధి నుంచి వచ్చిన రూ.5.45 లక్షల చెక్కును లక్ష్మణరావు సతీమణి నాగమణికి ఎస్పీ బుధవారం అందజేశారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల సమస్యలు తన దృష్టికి తీసుకురావాలన్నారు.కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధనపై శ్రద్ధ చూపాలి : డీఈవో అబ్రహం


విద్యార్థులను ఆరా తీస్తున్న డీఈవో

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 21: పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు బోధనపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని డీఈవో ఎస్.అబ్రహం అన్నారు. జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. 6, 9 తరగతి గదుల్లో విద్యార్థులకు బోధన, విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించారు. 360 మంది విద్యార్థులకు 70మంది హాజరు కాలేదని గుర్తించారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చెయ్యాలన్నారు. కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల్లో పాఠశాలలు పరిశీలించామన్నారు. ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, బుచ్చయ్య, హెచ్ఎం చంద్రావతి సిబ్బంది ఉన్నారు.

● చింతలపూడి: యర్రగుంటపల్లి జడ్పీ హైస్కూల్‌ను డీఈవో ఎస్.అబ్రహం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు క్లాసులను పరిశీలించారు. ప్రధాన మంత్రి నిధుల నుంచి వచ్చిన అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో కిరణ్‌బాబు, హెచ్ఎం ఇ.బాబూరావు ఉన్నారు.

మానవ శక్తి అపరిమితమైనది



రామ్మోహన్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21: మానవశక్తి అపరిమితమైనదని, సాంకేతిక పరిజ్ఞానం కూడా మానవశక్తిపైనే ఆధారపడి ఉంటుందని ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్ అన్నారు. నూతన విద్యావిధానంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు యువత సాధికారత అంశంపై సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే ప్రథమస్థానంలో నిలపగలిగిన శక్తి యువతకే ఉందన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు మాధవి రాణి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడారు. ప్రొఫెసర్ రామ్మోహన్‌ను ఘనంగా సత్కరించారు. సీపీ జ్యోతిర్మయి, రమ తదితరులు పాల్గొన్నారు.






రాష్ట్ర ఎన్నికల అధికారి సమీక్షలో స్వీప్ నోడల్ అధికారులు, జీలుగుమిల్లి, పోలవరం, చింతలపూడి మండలాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐ తహసీల్దార్, ఎంపీడీవో సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బంది

పోలింగ్ శాతం పెరగాలి

జిల్లా నోడల్ అధికారులతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమీక్ష

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 21: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా స్వీప్ సూక్ష్మ ప్రణాళికలను అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం స్వీప్ అధికారుల బృందం రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయ ఆధ్వర్యంలో బుధవారం అన్ని జిల్లాల స్వీప్ నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముకేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ జిల్లా స్థాయితో పాటు నియోజకవర్గాలు, పోలింగ్ స్టేషన్ల స్థాయిలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా స్వీప్ సూక్ష్మ ప్రణాళికలను రూపొందించి అమలు పరచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పట్టణాల్లో అపార్టుమెంట్ వాసులు, కార్మికులు, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, గిరిజన ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పెద్దగా శ్రద్ధ చూపడం లేదన్నారు. వారికి ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల విద్యపై అవగాహన కల్పించేందుకు అనువైన సూక్ష్మ ప్రణాళికలను అమలు పరిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఏలూరు జిల్లాలో అమలు చేస్తున్న ఓటర్ల విద్య ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాలను ఏలూరు జిల్లా స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన డీఎస్పీ

జీలుగుమిల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పోలవరం డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగిన సౌకర్యాలు, అనుకూల వాతావరణంపై ఆరా తీశారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిఘా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్సై వి.చంద్రశేఖర్ ఉన్నారు.

● పోలవరం: మండలంలో పోలింగ్ కేంద్రాలను పోలవరం ఎంపీడీవో జి.శ్రీను ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇటుకలకోట, వింజరం, వెంకటరెడ్డిగూడెం, గుంజవరం, చేగొండపల్లి, మామిడిగొంది, దేవరగొంది, ప్రగడపల్లి, జిల్లేళ్లగూడెం, ఎల్ఎన్‌డీ.పేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ఎస్ఐ ఎస్ పవన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కె.వెంకట శివయ్య పరిశీలించారు. ఓటర్లకు కావలసిన సౌకర్యాలపై కార్యదర్శులు, వీఆర్వోలను అడిగి తెలుసుకుని, సూచనలు ఇచ్చారు.

● చింతలపూడి: మండలంలో పోలింగ్ బూత్‌లను సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ పరిశీలించారు. పట్టణంలోని పాత చింతలపూడి, ఘంటావారివీధి, ఆర్.కె.నగర్, తదితర బూత్‌లను పరిశీలించి సౌకర్యాలపై డీఎల్ఓలకు సూచనలు ఇచ్చారు. నియోజకవర్గంలో 273 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఇందులో 66 సెన్సిటివ్ బూత్‌లను గుర్తించామని చెప్పారు. ఆయన వెంట సీఐ సుధాకర్, బూత్‌లెవెల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చింతలపూడి, ఫిబ్రవరి 21: గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే మరో దశ ఉద్యమం చేపడతామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎ.కొత్తగూడెంలో నిర్వాసిత రైతుల సమావేశం బుధవారం జరిగింది. నిర్వాసిత రైతులకు ఆర్బిట్రేషన్ ద్వారా పరిహారం పెంచి న్యాయం చేస్తామని కలెక్టర్ ఇచ్చిన హామీ రైతులందరికీ అమలు చేయలేదన్నారు. రాఘవాపురం, ఎండపల్లి గ్రామాల్లోని కొద్ది మందికి మాత్రమే పరిహారం పెంచి ఇచ్చారని, మిగిలిన రైతులకు అన్యాయం జరిగిందన్నారు. పరిహారం పెంపుతోపాటు సర్వీసు రోడ్లు వేయాలని, బోర్లు కోల్పోయిన వారికి బోర్లు, విద్యుత్ లైన్లు, ఆయిల్‌ఫాం, కొబ్బరి, ఉద్యాన తోటలకు పరిహారం పెంపు హామీ అమలు కాలేదన్నారు. ఎండపల్లిలో ఎర్ర చెరువులో మట్టిని ఇష్టానుసారం తవ్వి గోతులుగా మార్చారని, దీనివలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పుంతరోడ్లు నాశనమయ్యాయని, గణిజర్ల, చింతకాయల కొత్తగూడెం మధ్య రెస్ట్ ప్లేస్ రావడంతో అండర్ పాస్ నిర్మాణం లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైవే వెంబడి రైల్వేలైన్ పేరుతో మరికొంత భూసేకరణ చేస్తారనే భయం రైతుల్లో ఉందన్నారు. రైతులు న్యాయం కోసం ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకుడు చీకటి శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, గణపతి, వెంకట సుబ్బారావు, అంజియ్య, చీకటి అప్పారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ క్లెయింల స్వీకరణ


క్లెయింలు స్వీకరిస్తున్న అధికారులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 21: జీలుగుమిల్లి వయా బుట్టాయగూడెం, పట్టిసీమ రోడ్డు విస్తరణలో భాగంగా భూములు గృహాలు దుకాణాలు కోల్పోయే వారి వివరాలతో ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. సంబంధిత తహసీల్దార్‌లు రాజశేఖర్, పోతురాజు, ఎన్‌హెచ్ అధికారులు బుధవారం తహసీల్దారు కార్యాలయంలో 110 క్లెయింలను స్వీకరించారు. రైతుల అభ్యంతరాలు నమోదు చేసుకున్నారు. మరికొందరు దుకాణదారులు సర్వే పూర్తిచేసి నోటిఫికేషన్‌లో పేర్లు ప్రకటించకపోవడంతో గందరగోళం నెలకొంది. మరోసారి రెండో నోటిఫికేషన్ వస్తుందని అధికారులు చెప్పారు. క్లెయిం స్వీకరణ అనంతరం రైతులు తమ భూముల్ని కోల్పోయే క్రమంలో క్షేత్రస్థాయిలో అక్కడ ఉన్న చెట్లు ఇతర పంటలపై పరిశీలన జరిపి సంబంధిత అధికారులు నమోదు చేసుకుంటారన్నారు.

రెడ్ బుక్ డే జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రవి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 21: విప్లవ సారధి లెనిన్ పుస్తకాన్ని అధ్యయనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి పిలుపునిచ్చారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం రెడ్ బుక్ డే అధ్యయన వేదిక నిర్వహించారు. రవి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రెడ్ బుక్ డే జరుపుకోవాలని, సమాజాన్ని మార్చేందుకు ప్రతి ఒక్కరు ఈ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలన్నారు. పసల సూర్యారావు, బి.రాంబాబు, ఏ ప్రభాకరరావు, వై. సీత, నారాయణ, గోపి, మాబు సుభాని, తదితరులు పాల్గొన్నారు.

14న తెరుచుకోనున్న పొగాకు కేంద్రాలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 21: పొగాకు వేలం కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. మార్చి 14న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో రెండు, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురంలో వేలం కేంద్రాలు తెరుచుకోనున్నాయి. ఈ ఏడాది పొగాకు అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బుధవారం గుంటూరు పొగాకు బోర్డు కార్యాలయంలో జరిగిన సమావేశంలో బోర్డు అధికారులు, రైతు సంఘాల నాయకులు, కొనుగోలు కంపెనీలతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

పాఠశాల వద్ద విద్యార్థి, ప్రజా సంఘాల ధర్నా



గిరిజన ఆశ్రమ పాఠశాల వద్ద ధర్నా

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 21: గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులపై నిర్లక్ష్య ధోరణి తగదని విద్యార్థి గిరిజన సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. జీలుగుమిల్లి బాలుర పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. గిరిజన పాఠశాలల్లో అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, మండల సీపీఎం పార్టీ కార్యదర్శి తెల్లం దుర్గారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా డివిజన్ కార్యదర్శులు కె.లెనిన్, డి.యస్వంత్ ఉన్నారు.

భూ హక్కు కొత్త చట్టం రద్దు చేయాలి



రిలే నిరాహార దీక్షలో న్యాయవాదులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21: భూహక్కుల యాజమాన్య చట్టం 2022 రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు 27/2023 చట్టం ప్రజా వ్యతిరేక చట్టమని దీని వలన చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోతారని, భూములన్నీ భూస్వాముల చేతుల్లోకి వెళ్ళిపోతాయని, ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఇప్పటికే కొన్ని రోజుల నుంచి కోర్టు విధులను బహిష్కరించి ఏలూరు జిల్లా కోర్టు గేటు వద్ద రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తున్నారు. బుధవారం కూడా ఈ దీక్షలను నిర్వహించారు.

దళితుల అభివృద్ధికి రాజకీయ పార్టీలు కృషి చేయాలి


మేనిఫెస్టో ప్రదర్శిస్తున్న దళిత నేతలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 21: దళిత, గిరిజన, ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి రాజకీయ పార్టీలు కృషి చేయాలని రాష్ట్ర దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనుల కోసం 10 అంశాలతో మేనిఫెస్టో రూపొందించామన్నారు. రాజకీయపార్టీల మేనిపెస్టోలో వాటిని చేర్చాలన్నారు. మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలు దళిత, గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

పోలవరం, ఫిబ్రవరి 21: పదో తరగతి విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీకాంతం, ఎన్.ప్రభ, భాగ్యరేఖ, దుర్గాప్రసాద్, సుందర్‌బాబు, బాబూరావు, సుధాకర్, రోజామణి, విజయలక్ష్మి, భాస్కరరావు, దుర్గాభవాని, నిర్మల, నానిబాబు పాల్గొన్నారు.

ప్రజా పోరుతో ప్రజల్లోకి బీజేపీ

కుక్కునూరు, ఫిబ్రవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రజా పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మొడియం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. తూము వెంకన్న, వెలకం బాలక్రిష్ణ, మైసాక్షి రాము, వాడపల్లి లక్ష్మణాచార్యులు, వరలక్ష్మి, సున్నం మహేష్, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక నిరాహార దీక్షలో జనసేన పార్టీ నేతలు

జనసేన నేతల రిలే నిరాహార దీక్షలు

చింతలపూడి, ఫిబ్రవరి 21: మండలం, పట్టణంలో సమస్యల పరిష్కారం కోరుతూ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బుధవారం సామూహిక రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి లేదని, ఐదేళ్లలో రోడ్లు దారుణంగా ఉన్నాయన్నారు. గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, చింతలపూడిలో ఆర్టీసి డిపో ఏర్పాటు చేయాలని, పట్టణంలో మరుగుదొడ్లు, డ్రైయినేజీలు, సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి చేయాలని దీక్ష రెండు రోజులపాటు జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, మాటూరి వెంకట్రామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరి రావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి సంఘీభావం తెలిపారు. చీదరాల మధుబాబు, పలువురు జనసేన నాయకులు దీక్షలో పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి21: లక్ష్మీనారసింహుడు కొలువైన సుందరగిరి విద్యుద్దీప కాంతులీనుతోంది. చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో కల్యాణోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. సుందరగిరిపైన, కొండ దిగువన ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకరణలు, దేవతామూర్తుల భారీ విద్యుత్ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆలయగోపుర సముదాయాల వద్ద, నూతన మండపప్రాంతం, రంగురంగుల విద్యుద్దీప కాంతులతో సుందరగిరి పరిసరాలు కనువిందు చేస్తున్నాయి.

లక్ష్మీగణపతికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21: సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయం వద్ద భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. దక్షిణపువీధి, పవరుపేట, పత్తేబాద, ఆదివారపుపేట విఘ్నేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు విశేష పూజలు చేశారు.

సంతాన వేణుగోపాలుడి సన్నిధిలో హోమాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21: తూర్పువీధిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం మహా సుదర్శన, మహాలక్ష్మీ హోమాలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం విజయ వెంకట రామానుజాచార్యులు, కనిగొళ్ళ సురేష్‌శర్మ భక్తులతో పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** రోడ్డు ప్రమదాల నివారణ కోసం జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల ధ్రువపత్రాలు వాహనంతోనే ఉండాలని, డ్రైవింగ్ లైసెన్సు కచ్చితంగా ఉండాలన్నారు.
- **ఏలూరు రూరల్ :** కొత్తపేట అర్బన్ పీహెచ్‌సీలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్ శశాంక్ మాట్లాడారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు.
- **కామవరపుకోట :** పాతూరు - కళ్ళచెరువు రోడ్డు నిర్మాణానికి ఎంపీ కోటగిరి శ్రీధర్, విజయరాజు శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీ హాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. సర్పంచ్ కరిపోతు అనూష, పంచాయతీ కార్యదర్శి జీడీవీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- **పెదపాడు :** ఎయిడ్స్ అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన కళాజాత ప్రదర్శన వసంతవాడలో బుధవారం జరిగింది. హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు.
- **వేలేరుపాడు :** రుద్రమకోట పంచాయతీ ద్వారా సుమారు రూ.3లక్షలతో మంచినీటి సరఫరా ప్లాంట్‌ను సర్పంచ్ నాగంపల్ల స్వర్ణలత ఏర్పాటు చేయించారు. బుధవారం ప్లాంట్‌ను లాంచనంగా ప్రారంభించారు.
- **టి.నరసాపురం :** మర్రిగూడెంలో ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణానికి జడ్పీటీసీ సూర్య నారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సోయం బిందు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** రంగాపురంలో మాలమహాసేన అధ్యక్షుడు ఆలగా రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో మాలమహాసేన తరఫున స్వతంత్ర అభ్యర్థులను నిలబెడతామన్నారు.
- **పోలవరం :** కిడ్నీ సమస్యతో ఆపరేషన్ చేయించుకుని ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న యామన కుమారస్వామి కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. గోళ్ళ గణేశ్, పూనెం పోశిబాబు వి.చంద్రయ్య పాల్గొన్నారు.
- పోలవరం మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో జి.శ్రీను బుధవారం తెలిపారు. వివరాలకు 9493742454 నెంబరులో సంప్రదించాలని కోరారు.
- **ఉంగుటూరు :** మండలంలోని నాచుగుంటలో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు ప్రారంభించారు. సర్పంచ్ యేలేటి సునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసి జయలక్ష్మి పాల్గొన్నారు.
- **భీమడోలు :** విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక ఈ నెల 23న జరుగుతుందని ఈఈ నటరాజన్ తెలిపారు. భీమడోలులో ఫోరమ్ ఛైర్‌పర్సన్ కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరమ్ విశ్రాంత న్యాయమూర్తి బి సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని, సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావచ్చునని ఈఈ తెలిపారు.





అంబికా రాజాకు సాహిత్య మండలి సత్కారం, దెందులూరు డీఈడీ విద్యార్థుల ప్రదర్శన, పంగిడిగూడెం విద్యార్థులకు బహుమతుల పంపిణీ

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21: జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మానికి కళాశాల అధ్యక్షుడు గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించారు. విద్యా బోధన, అభ్యసనానికి మాతృభాషకు మించిన సాధన లేదన్నారు. తెలుగు అధ్యాపకులు పరమేశ్ మాట్లాడుతూ మాతృభాష అద్వితీయమన్నారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు సీహెచ్ ఉదయ లక్ష్మి, ఎం.రాంబాబు, టీవీఎస్.పద్మావతి, పీవీ.దుర్గాప్రసాద్, కావ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఆర్ఆర్.పేట పాఠశాలలో హెచ్ఎం సత్యసారధి తెలుగుతల్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

మనిషి జీవితంలో తల్లిఒడి బిడ్డకు తొలి బడి అని, ప్రతిఒక్కరూ అమ్మ భాషలోనే మాట్లాడుదామని కవి రత్న అంబికా రాజా అన్నారు. గరికపాటి ఆర్ట్స్ థియేటర్, సాహిత్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబికా రాజా మాట్లాడుతూ జీవితంలో పైకి ఎదగాలంటే మాతృభాష ప్రధాన మార్గం అన్నారు. కార్యక్రమంలో గరికపాటి కాళిదాసు, పుల్లాబొట్ల పురుషోత్తం, మైలవరపు గురుశర్మ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రతిభ స్కూల్ విద్యార్థులు కవులు, తెలుగుతల్లి, కృష్ణదేవరాయల వేషధారణలో అలరించారు. ప్రిన్సిపాల్ సరోజా రెడ్డి, సుభాష్ రెడ్డి, టీచర్స్ పూర్ణిమా దేవి, వెంకట్రావు పాల్గొన్నారు.

● దెందులూరు: మాతృ భాష తెలుగును మరవరాదని మాతృదేవోభవ సేవా ట్రస్టు సభ్యుడు వై.ఆనందనాయుడు అన్నారు. డీఈడీ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. డీఈడీ కాలేజీ విద్యార్థులు తెలుగు ప్రాధాన్యం వివరిస్తూ అక్షర ప్రదర్శన ప్రదర్శించారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● టి.నరసాపురం: స్థానిక విజన్ స్కూల్ విద్యార్థులు తెలుగుతల్లి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం పురం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషలో బోధన చేయడం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత వికసిస్తుందన్నారు. మాతృభాష మాధుర్యాన్ని గుర్తించి తెలుగు భాష సంస్కృతి, వారసత్వాన్ని నిలబెట్టుకోవాలని ఆయన తెలిపారు.

● ఉంగుటూరు: మాతృభాషలో భావాలను వ్యక్తం చేసినంతగా మరే భాషలో చేయలేమని నారాయణపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి కొండా రవి మాట్లాడుతూ దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: తెలుగుభాష తియ్యదనాన్ని చాటిచెప్పాలని పంగిడిగూడెం జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం పి.సురేష్ అన్నారు. మాతృభాష దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజు నన్నయ కాలం నాటి నుంచి నేటివరకూ తెలుగు ప్రాశస్త్యాన్ని వివరించారు. విద్యార్థుల పద్యపఠనం, తెలుగు గేయాలు, నాటికలతో ఉత్సాహంగా సాగింది. పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు.

జర్నలిస్టులకు రక్షణ కరువు

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడికి నిరసనగా ఆందోళనలు



కైకలూరులో విలేకర్లపై దాడులు నిరసిస్తూ పాత్రికేయుల ర్యాలీ

అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టుపై వైసీపీ మూకల దాడి దారుణమని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆందోళనలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాల వద్ద అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

కైకలూరులో జర్నలిస్టుల ర్యాలీ

కైకలూరు, ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. బుధవారం కైకలూరులో నియోజకవర్గ ప్రెస్‌క్లబ్, ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో విలేకర్లపై దాడులు ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. నల్లరిబ్బన్లు ధరించి విలేకర్లపై దాడులు చేసిన వారిని తక్షణమే శిక్షించాలని ప్ల కార్డులతో నినాదాలు చేశారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయం, మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడులు దారుణమన్నారు. రోజురోజుకు పత్రికారంగంపై అధికారపార్టీ నాయకుల ఆగడాలు ఎక్కువై పోతున్నాయన్నారు. జర్నలిస్టుల స్వేచ్ఛని హరించేవారిపై కఠిన శిక్షలను విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఎస్. పోతురాజు, రూరల్ సీఐ కృష్ణకుమార్, టౌన్ పోలీసుస్టేషన్ ఏఎస్సై వెంకటేశ్వరరావుకు వినతిపత్రాలను అందజేశారు. ఏలూరు జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి పెద్ది సురేష్, కార్యవర్గ సభ్యుడు నరహరిశెట్టి శ్యాంబాబు, విజయకుమార్, కురేళ్ళ కిషోర్, వాసే పౌలురాజు, ముదినేపల్లి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నాగరాజు, ఎర్రంశెట్టి శ్రీనివాసు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కె సువర్ణరాజు, అంబటి సత్యనారాయణ, సంపత్, నిక్కు శంకర్, ఎన్‌వీఎస్ పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: జగన్ పాలనలో ఇటు ప్రజలకు, పాత్రికేయులకు కూడా రక్షణ లేకుండా పోయిందని టీడీపీ పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు మండిపడ్డారు. ఇది జగన్ పతనానికి దారితీస్తుందన్నారు.

భీమవరం అర్బన్: ప్రతికా స్వేచ్ఛను కాపాడి..జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నాయకులు లంక కృష్ణమూర్తి, దండు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు.


తహసీల్దార్‌కు లింగపాలెం మండల విలేకరుల వినతిపత్రం

ఉంగుటూరు: ఉంగుటూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పోతురాజుకు వినతి పత్రం అందించారు. అధ్యక్షుడు ముప్పన భుజంగరావు, ఉపాధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరావు, ఆర్జా బులి వీరాస్వామి, పి.రవిశంకర్ పాల్గొన్నారు.

లింగపాలెం: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని లింగపాలెం మండల ప్రెస్‌క్లబ్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు లింగపాలెం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విలేకరులు రాపాక మోహన్‌రావు, ఎస్.డి.వి ప్రసాద్, కట్టా శ్రీనివాసరావు, చలమాల శ్రీనివాసరావు, కుమార్ మంగళం, లక్కపాం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మీడియాపై దాడి అమానుషం : పితాని

పెనుగొండ: జగన్మోహనరెడ్డి ప్రభుత్వ అక్రమాలపై నిజాలను నిగ్గు తేలుస్తున్న మీడియా సంస్థలు, ప్రతినిధులపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చినమల్లంలో ప్రజల వద్దకు పితాని ఎన్నికల ప్రచార పాదయాత్రలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

జడ్పీ హైస్కూళ్ల అప్‌గ్రేడ్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 21: నూజివీడు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో మండలానికి రెండు జడ్పీ హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు మండలం నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాల, ముసునూరు మండలంలో ముసునూరు జడ్పీ హైస్కూల్, చాట్రాయి మండ లంలో చాట్రాయి జడ్పీ హైస్కూల్, ఆగిరిపల్లి మండలంలోని ఈదర జడ్పీ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయగా, చాట్రాయి జడ్పీ హైస్కూల్‌ను మాత్రం విద్యార్థుల చేరిక అంతగా లేకపోవడంతో సదరు జూని యర్ కళాశాల తాత్కాలికంగా మూతపడింది. తాజాగా మరో మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశా లు జారీ చేశారు. వీటిలో చాట్రాయి మండలం చిన్నంపేట జడ్పీ హైస్కూల్‌ను, ముసునూరు మండలం చెక్కపల్లి, గోపవరం జడ్పీ హైస్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే నూజివీడు పట్టణంలోని మడుపల్లి తాతయ్య జూనియర్ కళాశాలతో పాటు గత ఏడాది ప్రారంభమైన నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాలను మండలంలోని రెండు కళాశాలలుగా చూపుతూ నూతనంగా మరే పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయకపోవడం విశేషం.

నూజివీడు నుంచి పోటీ చేస్తా : ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు, ఫిబ్రవరి 21: నూజివీడు అసెంబ్లీ స్థానం నుంచి తానే వైసీపీ తరఫున తిరిగి పోటీ చేస్తున్నట్లు నూజివీడు సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. నూజివీడు పట్టణంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తాను నూజివీడు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానన్నారు.

బలివే రామలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

ముసునూరు, ఫిబ్రవరి 21: బలివే రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఆరు నెలల కాలానికి రూ.1,85,500 ఆదాయం వచ్చినట్లు గన్నవరం దేవదాయ, ధర్మదాయ శాఖ తనిఖీదారు వి.సుధాకర్ తెలిపారు. బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో మార్చి 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో కొబ్బరి చెక్కలను పోగుచేసుకునే హక్కుకు వేలంపాటను నిర్వహించారు. ఏలూరుకు చెందిన పోల్నాటి పరమేశ్వరి రూ.1,12,000లకు పాడుకున్నట్లు సుధాకర్ తెలిపారు. ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ నాగుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బలివే ఉత్సవాల నిర్వహణపై సమావేశం

ముసునూరు, ఫిబ్రవరి 21: బలివే శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాలుగురోజులపాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లుపై నూజివీడు సబ్ కలెక్టర్ భవానిశంకరి అధ్యక్షతన గురువారం ఉదయం 11గంటలకు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరుగుతుందని ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులందరు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.


ఆక్వా రైతులను విచారిస్తున్న ఆర్డీవో ఖాజావలి

మత్స్యశాఖ ఏడీపై విచారణ

కలిదిండి, ఫిబ్రవరి 21 : చేపలు, రొయ్యల చెరువులకు అనుమతులు మంజూరులో మత్స్యశాఖ ఏడీ చాంద్ బాషా జాప్యం చేస్తున్నారన్న ఆక్వా రైతులు ఫిర్యాదు మేరకు బుధవారం మూల్లంక, పెదలంక గ్రామాల్లో ఆర్డీవో ఖాజావలి ఆక్వా రైతులను విచారించారు. అనుమతుల మంజూరులో జాప్యం జరుగుతోందని, డబ్బులు ఇచ్చిన వారికే ముందుగా అనుమతులు ఇస్తున్నారని, దరఖాస్తు చేసి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం క్షేత్రస్థాయిలో చెరువు వద్దకు వచ్చి పరిశీలించటం లేదని ఆర్డీవోకి పలువురు ఆక్వా రైతులు తెలిపారు. చేపల, రొయ్యల చెరువులకు అనుమతులు త్వరితగతిన ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 8న కైకలూరులో ఆర్డీవో ఖాజావలీ ఈ విషయమై నాలుగు మండలాల ఆక్వా రైతులను విచారించారు. ఫిబ్రవరి 10న పెదలంకలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు పిటిషన్ దారులను విచారించారు. మరలా ఇప్పుడు ఆర్డీవో మూల్లంక, పెదలంక గ్రామాల్లో చేపల, రొయ్యల చెరువులను పరిశీలించి నేరుగా ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి విచారణ చేయటం చర్చనీయాంశంగా మారింది. మత్స్యశాఖ ఏడీపై చేపట్టిన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆర్డీవో ఖాజావలి తెలిపారు. తహసీల్దార్ దశిక వంశీ, వీఆర్వోలు కోకా చంద్రశేఖర్, డేవిడ్, జగన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల గృహ నిర్బంధం

ముదినేపల్లి, ఫిబ్రవరి 21: నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ గురువారం నిర్వహించ తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్లకుండా ఆ పార్టీ నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ కార్యక్రమానికి అనుమతులు లేనందున వెళ్లవద్దని పేర్కొంటూ ఎస్ఐ వెంకట్ కుమార్ జారీ చేసిన నోటీసులను బుధవారం రాత్రి పోలీసులు పీసీసీ సభ్యుడు మంగినేని బాబ్జీ, ముదినేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోళ్ల రాజ్‌కుమార్‌కు అందజేశారు.


పీసీసీ సభ్యుడు బాబ్జీకి నోటీసు ఇస్తున్న దృశ్యం


ఆగిరిపల్లి మండలంలో అలరిస్తున్న జబర్దస్త్ టీం

జబర్దస్త్ టీం ప్రచారం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 21: జబర్దస్త్, సినీ గాయకుల టీం ఆగిరిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ తరఫున ప్రచారం చేశారు. వట్టిగుడిపాడు, ఆగిరిపల్లి, గొల్లగూడెం, పాత ఈదర గ్రామాల్లో పర్యటించిన టీం మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) తన ఫౌండేషన్ ద్వారా 16 ఏళ్లుగా చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. జబర్దస్త్ కళాకారులు అభి, అప్పారావు, బాబి, వినోద్, ఇమ్మానియేలు కామెడీ షోలతో, సినీ పాటలతో అలరించారు. సినీ గేయ రచయిత అనంతశ్రీరామ్, బీజేపీ నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, వి.స్వామి, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

కలిదిండి, ఫిబ్రవరి 21 : దుంపలకోడు దిబ్బలో రూ. 1.2 కోట్లతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఎమ్మెల్సీ జయమంగళతో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను నింపటానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. అనంతరం పోతుమర్రు, తాడినాడ, సున్నంపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, సొసైటీ చైర్మన్ సాగి చినబ్బాయి రాజు, పోతుమర్రు సర్పంచ్ గోర్ల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతానికి గీత కార్మికుడి బలి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని ఈదర గ్రామంలో పామర్తి సుబ్బారావు (70) ప్రమాదవశాత్తు విద్యుత్ తీగె తగిలి చెట్టుపైనే ప్రాణాలు వదిలాడు. ఇంటివద్ద గల కొబ్బరిచెట్టు కాయలు దింపేందుకు చెట్టెక్కగా ప్రమాదవశాత్తు చెట్టుకు ఆనుకుని వెళుతున్న కరెంటు లైన్ తీగ తగిలి అక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులు ఎక్స్‌కవేటర్‌తో మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



రెండు పూరిళ్లు దగ్ధం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 21: షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిపాకలు అగ్నికి ఆహుతైన ఘటన నూజివీడు మండలం మొర్సపూడి గ్రామంలో చోటుచేసుకుంది. మొర్సపూడి గ్రామానికి చెందిన బసవయ్య, ధనకోటేశ్వరరావు పూరిళ్ళు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి అయ్యాయి. కూలీ పనుల నిమిత్తం వారు బయటకు వెళ్ళిన సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి


హాజరైన టీడీపీ శ్రేణులు

ఇచ్చింది తక్కువ.. దోపిడీ ఎక్కువ

- జగన్‌కు ఎమ్మెల్యే కొలుసు చురకలు
- టీడీపీ రాగానే చింతలపూడి, తమ్మిలేరు పూర్తిచేస్తామని హామీ

చాట్రాయి, ఫిబ్రవరి 21: వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో రూ. 2.45 లక్షల కోట్లు ప్రజలకు పంచి, మద్యపాన నిషేధ హామీని తుంగలో తొక్కి. రూ. 1.25 లక్షల కోట్లు, కరెంట్, ఆర్టీసీ చార్జీలు మొదలైనవి పెంచి అంత కంటే ఎక్కువే జనం నుంచి దోపిడీ చేసిందని నూజివీడు టీడీపీ ఇన్‌చార్జి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి చాట్రాయిలో పార్టీ మండల అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాల కింద పంచినది, దోపిడీ చేసింది లెక్కేస్తే ప్రజలకే జగనే బాకీ ఉంటారని, కేవలం నవరత్నాలు ఇస్తే జీవితాలు మారతాయనుకుంటే భ్రమే అన్నారు. గత ప్రభుత్వంలో చౌక మద్యం క్వార్టర్ రూ. 50 ఉండగా వైసీపీ ప్రభుత్వం రూ. 180కు పెంచిందని, వైసీపీ నాయకుల కంపెనీలలో చౌక మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. ఆదాయం పెంచకుండా ఎల్లకాలం బటన్ నొక్కటం సాధ్యం కాదని ప్రజలు గమనించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడి సమస్యలతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని 70 శాతం పూర్తి చేయగా, ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు నిలిపివేసి మూల పడేయడంతో అన్నదాతలకు తీరని నష్టం జరిగిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చింతలపూడి, తమ్మిలేరు ప్రాజెక్టు పనులు ప్రారంభించి సాగు, తాగునీటి ఇబ్బందులు తీరుస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వైసీపీ గాలికొదిలి రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేస్తే దేశ విదేశాలలో తెలుగువారు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారని, తెలంగాణలో ప్రజల ఆందోళనలకు బీఆర్ఎస్ ప్రభుత్వం వణికి పోయిందన్నారు. అంతకు ముందు చాట్రాయిలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పార్థసారథికి ఘన స్వాగతం పలికారు. కొత్తపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్థసారథి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ శ్రేణులతో గ్రామంలో పాదయాత్ర చేశారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు అట్లూరి రమేష్, పర్వతనేని గంగాధర్, మండల నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, జగదీష్, చెన్నారావు, దుర్గారావు, చంద్రకళ, ధనలక్ష్మి, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ పోతురాజు

పెద్దింటమ్మ జాతరను విజయవంతం చేయాలి

కైకలూరు, ఫిబ్రవరి 21: కొల్లేటికోట పెద్దింటమ్మ ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి, భక్తులకు సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ ఎస్. పోతురాజు అన్నారు. బుధవారం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద జాతర మహోత్సవాలపై పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది కూడా అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. మంచి నీరు, వైద్యం, చలువ పందిళ్ళు వంటివి ఏర్పాటు చేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజయకుమార్, ఆలయ చైర్మన్ పులవర్తి లక్ష్మణ్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈవో గోపాలరావు, రూరల్ ఎస్సై రామకృష్ణ, ఈవోపీఆర్డీ రవి శంకర రావు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నున్న శ్రీనివాసరావు

మాతృ భాషను కాపాడుకోవాలి

కైకలూరు, ఫిబ్రవరి 21: మాతృభాష గొప్పతనం మహోన్నతమైనదని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నున్న శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మాతృభాషా దినోత్సవాన్ని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 7 వేల భాషలున్నాయని వాటిలో భారతదేశంలో 1650 భాషలున్నాయన్నారు. వీటిలో అనేక భాషలు కనుమరుగయ్యే ప్రమాదంలో పడ్డాయన్నారు. ఎవరి మాతృభాష వారికి అమ్మతో సమానమని అటువంటి అమ్మ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కడప కేధారి, అధ్యాపకులు పంకజ్ కుమార్, రవికుమార్, హరిప్రసాద్, డి. జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని అధోగతిపాల్జేసిన జగన్

మండవల్లి, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో ఆక్వారంగం అధోగతిపాలు కావడానికి జగన్ ప్రభుత్వం కారణమని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండవల్లి మండలం లోకుమూడి, చావలిపాడు, ప్రత్తిపాడు, తక్కెళ్ళపాడు గ్రామాల్లో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఆక్వారంగ అభివృద్ధి కోసం ట్రాన్స్‌ఫార్మర్లు సబ్సిడీపై అందించామని, విద్యుత్ బిల్లుల్లో కూడా సబ్సిడీ విధానాన్ని అమలు చేశామన్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ ఆక్వారంగంపై ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. ఒకవైపు ట్రాన్స్‌ఫార్మర్లు వేయించుకోలేక మరోవైపు విద్యుత్ బిల్లుల మోత తట్టుకోలేక రొయ్యలు, చేపల సాగుకు రైతులు భయపడుతున్నారన్నారు. జగన్ సర్కారు ఆక్వాసాగుపై సరైన విధానాన్ని అమలు చేయకపోవడంతో మార్కెట్ల ధర నిలకడ లేక రైతాంగం అల్లాడిపోతున్నారని కామినేని ఆవేదన వ్యక్తం చేశారు. కైకలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పథకాలు పట్టించుకోని అధికార పార్టీ నాయకులు, హైటెక్ హైడ్రామాలతో ప్రజలను మాయమాటలతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కామినేని ధ్వజమెత్తారు. అరాచక పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు టీకేఎం నాని, మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, నియోజకవర్గ తెలుగురైతు నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు, బొల్లంపల్లి కృష్ణారావు, తలారి రాజేష్, గడిదేశి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పత్తిపాడు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కామినేని





ముదినేపల్లిలోని అంతర్గత రహదారిని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు.. ఉప్పరగూడెం ప్రధాన రహదారిపై తొలగిన ముళ్ల చెట్లు

అంతర్గత రహదారిపై పారిశుధ్య పనులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 21 : ముదినేపల్లి పంచాయతీ ఏరియాలో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారిని శుభ్రపరిచే పనులను పంచాయతీ అధికారులు చేపట్టారు. "ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే" శీర్షికన ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో బహిర్భూమిగా మారిన ఈ రోడ్డు దుస్థితిపై ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో బుధవారం రోడ్ల పరిశుభ్రత పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన ముళ్ల చెట్లను తొలగించే పనులను నిర్వహించారు. స్థానికులు ఈ రోడ్లను బహిర్భూమిగా వినియోగించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రజల రాకపోకలకు అనువుగా రోడ్డును బాగు చేస్తామని పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. రహదారి బాగుచేయడంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ముళ్ల పొదల తొలగింపు..

అలాగే 'ముళ్ల పొదలతో మూసుకుపోయిన రోడ్డు' శీర్షికన సింగరాయిపాలెం - బంటుమిల్లి ప్రధాన రహదారికిరువైపులా పెరిగిన ముళ్ల చెట్ల వల్ల ప్రయాణికుల ఇబ్బందులపై ఇటీవల ప్రచురితమైన కథనానికి బంటుమిల్లి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. రెండు రోజులుగా ముళ్ల పొదలను పూర్తిగా తొలగించారు.

నేటి నుంచి రాజవరప్రసాద మాత ఉత్సవాలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 21: ఆగిరిపల్లి మండలం రాజవరం గ్రామంలో గల రాజవరప్రసాద మాత ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24 వరకు వేడుకలు నిర్వహిస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. 22వ తేదీ ఉదయం రెవరెండ్ ఫాదర్ జంగం విజయ్‌కుమార్‌తో దివ్యబలిపూజ మహోత్సవం, సాయంత్రం తేరు ఊరేగింపు, 23వ తేదీ సాయంత్రం ఫాదర్ లాము జయరాజు నేతృత్వంలో దివ్యపూజ సమర్పణ, సెయింట్ ఆన్స్ సిస్టర్స్ సాంస్కృతిక కార్యక్రమాలు, 24 మధ్యాహ్నం కొండపై అన్నదానం, రాత్రి 10.30కి వేటపాలెం వారిచే బాణసంచా కాల్పులు, 11 గంటలకు ధనవంతుడు బీజలాజరు నాటకం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విశ్వాసులు పెద్దఎత్తున రావలసిందిగా కోరారు.



బాలరావమ్మ గ్రామోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 21: దుగ్గిరాల బాలరావమ్మ మాఘపౌర్ణమి తిరునాళ్ళ సందర్భంగా బుధవారం గ్రామోత్సవం ఆగిరిపల్లి మండల పరిధిలోని వడ్లమాను, తాడేపల్లి, చొప్పరమెట్ల గ్రామాల్లో జరిగింది. భక్తులు పెద్దయెత్తున ఊరేగింపులో పాల్గొన్నారని ఆలయ కమిటీ చైర్మన్ మాదల శివరామ్‌ప్రసాద్ తెలిపారు.



వలంటీర్లకు సత్కారం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో జగన్‌ను మరలా సీఎంను చేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందని, నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండల పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఉత్తమసేవలు అందించిన వలంటీర్లను ఆయన సత్కరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమెళ్ళ కృష్ణంరాజు, నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, ఎంపీడీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

నూజివీడు, ఫిబ్రవరి 21: నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.హేమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో డైట్ ఫర్ లివింగ్, ట్యాగింగ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, కీ రోల్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, ఖేలో ఇండియా తదితర అంశాలపై చర్చించారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవన్‌ను కలసిన టీడీపీ నాయకుడు పెన్మెత్స

కైకలూరు, ఫిబ్రవరి 21: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కైకలూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం భీమవరంలో పవన్‌కల్యాణ్‌ను కలిసి కైకలూరు నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించడమే లక్ష్యంగా ప్రజల్లోకి జనసేన-టీడీపీ నాయకులు వెళ్లాలని పవన్‌కల్యాణ్ సూచించినట్లు పెన్మెత్స తెలిపారు.



బీజేపీతో దోస్తీకి తహతహ శోచనీయం

చాట్రాయి, ఫిబ్రవరి 21: విభజన హామీలను తంగలో తొక్కి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బీజేపీతో దోస్తీకి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ-జనసేన తహతహలాడటం శోచనీయమని సీపీఐ (ఎంయల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి వెంకన్న సాక్షిగా ఢిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తామని, మిగతా రాష్ట్రాలతో పాటు అభివృద్ధి చెందే వరకు 5 ఏళ్ళు కాదు 10 ఏళ్ళు అయినా ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చాక మొండి చెయ్యి చూపిన మోదీని ఎలా నమ్ముతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు అధికార వ్యామోహం తప్ప రాష్ట్ర ప్రజల శ్రేయస్సు పట్టటం లేదన్నారు. బీజేపీతో పొత్తుకు వీరు చెప్పే కారణాలు హాస్యాస్పదమన్నారు.